క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయ ముట్టడి జయప్రదం చేయాలి

మరిపెడ రూరల్: మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు నేడు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ పింఛన్‌దారులకు పిలుపునిచ్చారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలో పింఛన్‌దారులతో కలిసి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి, ఎంఎస్పీ నాయకులు జినక స్వామి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి అండర్‌-17 క్రీడాపోటీలు

నెల్లికుదురు: ఈనెల 16నుంచి అండర్‌-17, 14 క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాందాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో అండర్‌-17, 14 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు నిర్వహిస్తున్నట్లు, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ సీహెచ్.అయిలయ్య పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



కేసముద్రం: హక్కుల సాధన కోసం కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బి.ప్రదీప్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి హరిహరగార్డెన్స్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాట ఘనత కమ్యూనిస్టులదే..

తొర్రూరు రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గుర్తూరు, అమ్మాపురం గ్రామాల్లో అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ యాకూబ్, డొనుక దర్గయ్య, మార్క సాంబయ్య, సాయిమల్లు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవ ర్యాలీ



మహబూబాబాద్ రూరల్: మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా అహిలే సున్నత్ వల్ జమాత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మహబూబియా మసీదు వద్ద భక్తులకు పాయసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మౌలానా మహమ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ, ఇక్బాల్, మహమ్మద్ వాహెద్, హారుణ్, ఫరీద్, శంతన్ రామరాజు పాల్గొన్నారు.

భక్తులకు షర్బత్ పంపిణీ

ప్రవక్త జన్మదిన మాసం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకరబోర్డులో ఆదివారం ముఖ్య అతిథిగా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ హాజరై భక్తులు షర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ.హారుణ్, ముబాషిర్, అనీస్, అమీర్, సోహెల్, ముబీన్, రిజ్వాన్, సమీర్, ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నలంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో బీఏ, బీఎస్సీ సైన్స్, మ్యాథ్స్, బీకాం కంప్యూటర్స్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఈనెల 15 నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వివరాలకు 93470 19203 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదలకు అన్నదానం

మహబూబాబాద్ రూరల్: గ్లోబల్ పీస్ ఫౌండేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు రూపురెడ్డి నవీన్ రెడ్డి కుమార్తె మన్వితరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య బాలునాయక్, రూపురెడ్డి ప్రవంతిరెడ్డి, గుగులోత్ వేణుగోపాల్, అనుముల సాయికుమార్, సాయికిరణ్, భూక్యా భరత్ నాయక్ పాల్గొన్నారు.

వార్డు అధికారులు వెళ్లిపోయారు..

- పారిశుద్ధ్య లోపంతో ప్రజల ఇబ్బందులు
- పెరగనున్న మున్సిపాలిటీ కష్టాలు



దోర్నకల్ మున్సిపాలిటీ కార్యాలయం

డోర్నకల్: నిధుల కొరత, పాలకవర్గం లేకపోవడం, అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న డోర్నకల్ మున్సిపాలిటీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపాలిటీలో వార్డు అధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారిలో 11మంది గ్రామ పాలనాధికారులుగా నియమితులై వారికి కేటాయించిన గ్రామాల్లో విధుల్లో చేరారు. 2022లో ఆరుగురు వీఆర్వోలు, 2023లో ఎనిమిది మందిని మున్సిపాలిటీకి కేటాయించగా వీరిని వార్డు అధికారులుగా కేటాయించారు. అప్పటి నుంచి తమకు కేటాయించిన వార్డుల్లో ఇంటి పన్ను వసూళ్లు, వార్డులో అభివృద్ధి పనులు, నూతన నిర్మాణాల పర్యవేక్షణ, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణస్థాయి పర్యవేక్షణ, తాగునీటి సరఫరా, తడిచెత్త, పొడిచెత్త, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, జనన, మరణాల నమోదు ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ తదితర విధులు నిర్వహిస్తున్నారు.

మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో 15మంది విధులు నిర్వహించాల్సి ఉండగా 14మంది వీఆర్‌పి, వీఆర్ఓలతోపాటు ప్రత్యేకంగా వార్డు అధికారిగా నియమితులైన ఒకరితో కలిపి 15మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఓ వార్డు అధికారి కొంతకాలం క్రితం పదోన్నతిపై వెళ్లిపోగా, మరో వార్డు అధికారి ప్రసూతి సెలవుపై వెళ్లిపోయారు. మిగతా 13మందిలో 11మంది ఇటీవల గ్రామ పాలనాధికారులుగా నియమితులై వెళ్లిపోగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే వార్డు అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై వెళ్లిన వారిలో వార్డు అధికారి సురేష్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. సురేష్ వెళ్లిపోవడంతో శానిటరీ విభాగం విధుల నిర్వహణ కష్టతరంగా మారింది. మరోవైపు మున్సిపాలిటీ పరిధిలో కీలకమైన మున్సిపల్ ఏఈ, టీపీఎస్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఇక్కడ ఇన్‌చార్జ్‌లుగా విధులు నిర్వహిస్తుండగా వారు సకాలంలో అందుబాటులో ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాల్సిన బిల్ కలెక్టర్ వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడినుంచి వేతనం పొందుతున్నాడు. మరోవైపు చెత్త వాహనాలు, పారిశుద్ధ్య సిబ్బంది కొరతతో సకాలంలో పారిశుద్ధ్య పనులు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మున్సిపాలిటీలో అవసరాలకనుగుణంగా సిబ్బంది నియామకం చేపట్టి వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పట్టించుకోవడం లేదు



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, కమిషనర్ వీధుల్లో పర్యటిస్తే ప్రజల సమస్యలు అర్థమవుతాయి. కార్యాలయ, పారిశుద్ధ్య సిబ్బంది కొరత ప్రజల పాలిటశాపంగా మారింది.

\- దేవర వెంకటేశ్వర్లు, అంబేద్కర్‌నగర్

యూరియాపై ఒక్కరూ మాట్లాడలేదు

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

కురవి: కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎంపీలను పార్లమెంటుకు పంపిస్తే ప్రయోజనం శూన్యమని తేలిందని, యూరియాపై ఒక్కరు మాట్లాడింది లేదని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ విమర్శించారు. ఆదివారం యూరియా కోసం స్వయంగా క్యూలో ఉండి కూపన్ తెచ్చుకున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పెద్ద తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల రోజులుగా రైతులు వ్యవసాయాన్ని వదిలేసి యూరియా కోసం రోజుల తరబడి క్యూలో నిలబడి ఉండాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. పది ఎకరాలు, ఐదు ఎకరాలు ఉన్న ఒక్క బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారని, తనకు ఐదున్నర ఎకరాల భూమి ఉన్నప్పటికీ ఒక్క బస్తా యూరియా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతుల కష్టాలు చూస్తే ప్రభుత్వం మీద దున్నపోతుమీద వర్షం పడ్డట్టు ఉంది తప్పా, సీఎం రేవంత్‌రెడ్డికి చీమకుట్టినట్టు కూడా లేదని ఎద్దేవా చేశారు. గూడూరు వద్ద ఇద్దరు రైతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని, రాష్ట్ర పరిస్థితికి నిదర్శనంగా నిలిచిందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు యూరియా అందివ్వాలని డిమాండ్ చేశారు.

యూరియా కొరత సృష్టిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రాజేష్

తొర్రూరు: యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తోందన్నారు. కేంద్రం సక్రమంగానే యూరియా సరఫరా చేస్తున్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు దళారులుగా మారి కొరత సృష్టిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొలుపుల శంకర్, పూసాల శ్రీమాన్, రవిబాబు, సత్యనారాయణ, రాజు, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

నట్టల మందులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న రవీందర్

నెహ్రూసెంటర్/మహబూబాబాద్: గొర్రెలు, మేకలకు నట్టమందులతోపాటు అన్నిరకాల వ్యాక్సిన్లను ప్రభుత్వం పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు ఎలాంటి మందులు, వ్యాక్సిన్లను పంపిణీ చేయడం లేదని దీంతో జీవాలు మృత్యువాత పడే ప్రమాదాలు ఉన్నాయన్నారు. గతంలో ప్రభుత్వం అన్నిరకాల మందులు, వ్యాక్సిన్లను పశువైద్యశాలలో అందించేదని తెలిపారు. మందులు, వ్యాక్సిన్లు కొనుగోలు చేయలేక గొర్ల కాపరులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నిరకాల మందులను ప్రభుత్వమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, మల్లయ్య, మల్లయ్య, యాకయ్య, వాసం దుర్గారావు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. యూరియా పంపిణీ అంశంపై వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. కొంతమంది వ్యక్తులు యూరియా అవసరంలేకున్నా క్యూలైన్లలో నిలబడి యూరియా బస్తాలు తీసుకుని బ్లాకులో విక్రయిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. గిరిజన గూడాలలో, తండాలలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన రైతులకు యూరియా ఇవ్వడంతోపాటు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు యూరియా అందించాలని అధికారులను ఆదేశించారు.

దిగబడుతున్న బస్సులు..



దిగబడిన బస్సును నెడుతున్న ప్రయాణికులు



జారి కింద పడిన ద్విచక్రవాహనదారుడు

కొత్తగూడ: పాలకుల అలసత్వమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో కాని ప్రజల పాలిటశాపంలా మారింది. నిధులు మంజూరు అయి రెండేళ్లు దాటినా పనులు పూర్తి చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తం అవుతోంది. కొత్తగూడ మండలం కొత్తపల్లి సమీపంలో వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మంత్రి సీతక్క వస్తుందని హడావుడిగా గుంతల్లో మొరం పోశారు. మొరం మెత్తగా ఉండటంలో వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. బస్సులు దిగబడటం, ద్విచక్రవాహనాలు జారిపడటంతో వీడియోలు తీసి సోషల్ మీడియాలో ప్రజలు ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇదిలా ఉంటే కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని తుడుందెబ్బ నాయకుడు ఈక విజయ్‌కుమార్ డిమాండ్ చేశాడు.

24న బయ్యారంలో విప్లవ సంస్థల విలీనసభ



మాట్లాడుతున్న అశోక్

బయ్యారం: ప్రతిఘటనా పోరాట పంథానే లక్ష్యంగా ఎంచుకున్న రెండు విప్లవ సంస్థల విలీనం సందర్భంగా ఈనెల 24న బయ్యారంలో బహిరంగసభను నిర్వహించనున్నట్లు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తెలిపారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విప్లవయోధులు చంద్రపుల్లారెడ్డి రాజకీయాలు, ప్రతిఘటన పోరాట పంథాను అమలుచేస్తూ ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్రంలో ఉన్న న్యూడెమోక్రసీ(అశోక్), న్యూడెమోక్రటిక్(రివల్యూషనరీ) పార్టీల మధ్య ఆగస్టు, సెప్టెంబర్ మొదటివారంలో పలు దఫాలుగా చర్చలు జరిగాయన్నారు. ఈచర్చల్లో ఇకనుంచి రెండు విప్లవసంస్థలు కలిసి న్యూడెమోక్రసీగా కొనసాగాలని నిర్ణయించుకున్నామన్నారు. విప్లవ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రటిక్ రెవల్యూషనరీ రాష్ట్ర నాయకులు కె.అనంతరెడ్డి, కార్యదర్శులు పొమ్మయ్య, ఊక్లా, శ్రీనివాస్, నాయకులు మదార్, వెంకట్‌రెడ్డి, రాంసింగ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



బీజేపీలో చేరిన గాంధీపురం వాసులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో స్థానిక ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని గాంధీపురం నాలుగో వార్డు 275 బూత్‌లో ఆదివారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలన్నారు. బూత్ అధ్యక్షుడిగా ధరంసోత్ కవిత, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ బాబర్, కార్యదర్శిగా బోడ బద్రులను నియమించారు. కార్యక్రమంలో నర్సింహ, భద్రయ్య, లింగయ్య, శంకర్, భీమా, రజియా, లాలీ, పట్టణ ప్రధాన కార్యదర్శి రవి కుమార్, నరేష్, ఎన్నికల కన్వీనర్ రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఎస్.వెంకటయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం లయన్స్ క్లబ్, కేసముద్రం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.6,500లను, 50కేజీల బియ్యంను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్, బోగోజు నాగేశ్వరాచారి, యర్రం శ్రీరాములు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

గూడూరు: మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు (హెచ్143) సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ యాకూపాష, ప్రధాన కార్యదర్శిగా బానోతు రామన్ననాయక్, కోశాధికారిగా గద్దల శ్రీనివాస్, కార్యదర్శిగా మంగ మహేందర్, ఉపాధ్యక్షుడిగా జిమ్మిడి సంతోష్, జిల్లా కమిటీ సభ్యుడుగా కమటం సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో వైద్యుడు మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ వైద్యుడు క్షీరసాగర్ పండరినాథ్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి వైద్యుడు క్షీరసాగర్ పండరినాథ్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు దేవరం ప్రకాష్ రెడ్డి, నాయిని సత్యపాల్ రెడ్డి, ఎడ్ల రమేష్, శంతన్ రామరాజు ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు..

బయ్యారం: బయ్యారానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు చెన్నబోయిన అచ్చయ్య(90) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు.అచ్చయ్య మృతదేహంను పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

హామీలు నెరవేర్చాలి

తొర్రూరు: సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెల్తూరి మల్లేశం అన్నారు. ఈమేరకు డివిజన్ కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు కల్పన, వీణ, రాధిక, భాస్కర్, రమేష్, ఐఈఆర్‌పీలు అనిల్, ఇంద్ర పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఇమామ్

నెల్లికుదురు: ఎస్‌జీఎఫ్ నెల్లికుదురు జోనల్ సెక్రటరీగా ఆలేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పీడీగా పనిచేస్తున్న మహ్మద్ ఇమామ్‌ను మండల కేంద్రంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ఐ క్రీడల సమావేశంలో ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్రీడలు

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో కురవి, సీరోలు మండలాలకు సంబంధించిన 68వ ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు జరుగుతాయని కురవి, సీరోలు ఎంఈఓలు వి.బాలాజీ నాయక్, ఇస్లావత్ లచ్చిరాంనాయక్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోర్నకల్: స్థానిక నెహ్రూస్ట్రీట్ సమీపంలో అపస్మారకస్థితిలో గుర్తించిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోర్నకల్ సీఐ చంద్రమౌళి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూస్ట్రీట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి 108వాహనానికి సమాచారం అందించి, ఏరియా ఆసుపత్రికి తరలించిన కొద్ది సేపటికే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సుమారు 40సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, చేతికి రాఖీ దారాలు ఉన్నాయని, బ్లూజీన్స్ పాయింట్, పాలపిట్ట రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

శ్రీకృష్ణుడు అందరివాడు

బయ్యారం: శ్రీకృష్ణ భగవానుడు అందరివాడని, ఆయనను అందరూ దైవంగా గుర్తించాలని ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక మహబూబాబాద్ అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. మండలంలోని గౌరారంలో ఆదివారం త్రైత సిద్ధాంత, ఆధ్యాత్మిక గ్రంథముల హిందూ ధర్మ ప్రచారంను ఇంటింటా నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు రజిత, వంశీ, సుధాకర్, క్రిష్ణ, సుజాత, కాలయశ్రీ, ఈశ్వర్, వీరస్వామి, సంయుక్త, లలిత, సుష్మ, నిరోష, వరుణ్, స్వరూప, రేఖ, తన్విక పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

గూడూరు: మండలంలోని దుబ్బగూడెం శివారు జోషితండాలో ఆదివారం ఉదయం ఎన్‌హెచ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు బానోతు లాల్య (75), ధారావత్ వీరన్న (40) మృతి చెందారు. విషయం తెల్సుకున్న మాజీ ఎంపీ కవిత జోషితండాకు చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ. 20లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో



రైతులకు నచ్చచెబుతున్న సీఐ సూర్యప్రకాష్

గూడూరు: గూడూరు మీదుగా నర్సంపేట వైపు వెళ్లే జాతీయ రహదారిపై కోబల్‌తండా జీపీ క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం గిరిజన రైతులు యూరియా కోసం రాస్తారోకో చేపట్టారు. దీంతో గంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెల్సుకున్న ఏఓ వచ్చి రెండు రోజుల్లో యూరియా ఇస్తానని చెప్పినా వినకుండా ఆందోళన చేశారు. ఆ తర్వాత వచ్చిన సీఐ సూర్యప్రకాష్ రైతులకు ఎంతగానో నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఓ మహిళా రైతు యూరియా ఇవ్వకుంటే రోడ్డుపైనే చచ్చిపోతామని, నీ కాళ్లు మొక్కుతా అని సీఐ కాళ్లపై పడడంతో, రెండు రోజుల్లో దగ్గర ఉండి యూరియా అందిస్తానని సీఐ చెప్పడంతో విరమించారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారిణి ప్రతిభ



పతకం అందుకుంటున్న స్వాతి

డోర్నకల్: రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాలోని బయ్యారానికి చెందిన ఎం.స్వాతి ప్రతిభ కనబర్చింది. ఖమ్మంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఖమ్మం వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్-2, 2025-26 రాష్ట్రస్థాయి జూనియర్, యూత్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో స్వాతి మూడు విభాగాల్లో పాల్గొని 58కేజీల కేటగిరిలో స్నాచ్ 50కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 55కేజీలు కలిపి 105కేజీల బరువు ఎత్తి మూడు బంగారు పతకాలు సాధించింది. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సతీమణి శ్రీమతి నందిని చేతుల మీదుగా స్వాతి బంగారు పతకాలు అందుకుంది. స్వాతిని వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ మండలోజు సుధాకర్, జనరల్ సెక్రెటరీ కొత్త రాంబాబు అభినందించారు.

వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట ఆదివారం గిరిజన హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమ్మె మూడోరోజు చేరుకున్న క్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

గార్ల: గార్ల ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న వర్కర్ల సమ్మె ఆదివారం 3వ రోజుకు చేరుకుంది. సమ్మెలో వర్కర్లు వీరన్న, సత్యం, నరసింహారావు, వెంకటేశ్వర్లు, బాబూరావు, శోభారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

మహావీర్ భగవాన్ శోభాయాత్ర



ఊరేగింపులో పాల్గొన్న జైన్‌లు

గార్ల: దస్ లక్షణ్ పర్వ్ పర్వదినం ముగింపు రోజు ఆదివారం జైన్‌ల ఆరాధ్య దైవం మహావీర్ భగవాన్ ఊరేగింపును గార్ల పురవీధుల్లో జైన్‌లు ఘనంగా నిర్వహించారు. 10రోజులపాటు జైన్‌లు ఉపవాసాలు ఉండి గార్లలోని జైన్‌మందిరంలో మహావీర్ భగవాన్‌కు అభిషేకాలు, శాంతిపూజలు నిర్వహించారు. ఈశోభాయాత్రలో జైన్‌లు విజయ్‌జైన్, మహేందర్‌జైన్, విమల్‌కుమార్‌జైన్, కిశోర్ జైన్, మహవీర్‌జైన్, ప్రవీణ్‌జైన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి కబడ్డీ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 26, 27, 28 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టు జిల్లా నుంచి ఎంపికైందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంద వీరన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం కబడ్డీ ఎంపికలు నిర్వహించారు.